ఓటరు జాబితాను సిద్ధం చేయాలి

గాంధారి, ఆగస్టు 14 : త్వరలో జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని డీఎల్పీవో సురేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో నమోదు చేసిన వివరాలను ఎప్పటికప్పుడూ 'టీఈ పోల్' వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల నియామకానికి ఇంటర్వ్యూలు

ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు

బాన్సువాడ రూరల్, ఆగస్టు 14 : బాన్సువాడ డివిజన్‌లో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల భర్తీకి మండల అభివృద్ధి కార్యాలయ భవనంలో అభ్యర్థులకు ఆర్డీవో రాథోరమేశ్, జిల్లా వెటర్నరీ అధికారి రాజేశ్వర్‌తో కలిసి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. బాన్సువాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని బాన్సువాడ, బిచ్కుంద, బీర్కూర్, నస్రుల్లాబాద్, మద్నూర్, మహ్మద్‌నగర్, పెద్దకొడప్‌గల్, జుక్కల్, నిజాంసాగర్, డోంగ్లీ మండలాల్లోని గ్రామాల్లో ఖాళీగా ఉన్న 28 చౌక ధరల దుకాణం డీలర్ల ఖాళీలను భర్తీ చేసేందుకు ఈ నెల 9న రాతపరీక్ష నిర్వహించారు. మెరిట్ ప్రకారం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా ఇంటర్వ్యూలు నిర్వహించామని ఆర్డీవో తెలిపారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో ఎకో బ్రిక్స్ తయారీ

ఎకో బ్రిక్స్ తయారీపై అవగాహన కల్పిస్తున్న ఎంపీవో

లింగంపేట, ఆగస్టు 14 : ప్లాస్టిక్ వ్యర్థాలతో ఎకో బ్రిక్స్ తయారీ చేసుకోవచ్చని మండల పంచాయతీ అధికారి మలహరి సూచించారు. మండలంలోని బాణాపూర్ తండాను బుధవారం ఆయన సందర్శించారు. ప్లాస్టిక్ కవర్లను బాటిల్స్‌లో నింపడంతో పర్యావరణ పరిరక్షణ చేపట్టవచ్చని సూచించారు. అనంతరం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ముంబాజీపేటలోని హోటల్‌లో ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్ వివరించారు. ప్లాస్టిక్ గ్లాసులకు బదులుగా స్టీల్ గ్లాసుల వినియోగించాలని సూచించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

కలెక్టర్ అశీష్ సంగ్వాన్

మాచారెడ్డి, ఆగస్టు 14 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే వ్యాధులు దరిచేరవని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. మాచారెడ్డి మండలంలోని లక్ష్మీరావులపల్లి గ్రామంలో బుధవారం కలెక్టర్ పర్యటించారు. ఇటీవల డెంగీ పాజిటివ్ వచ్చి కోలుకున్న బాధితుల ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. డెంగీ జ్వరం రావడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల చుట్టూ ఉన్న పరిసరాలను పరిశీలించారు. ఇంటి ఎదుట ఉన్న డ్రమ్ముల్లో ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచరాదని సూచించారు. మురుగు కాల్వలు శుభ్రంగా ఉంచాలని, ఫాగింగ్ చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అనంతరం మాచారెడ్డిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యాధికారి ఆదర్శ్‌కు సూచించారు. దవాఖానలో రోగులకు ఎలాంటి వైద్యం అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. వనమహోత్సవంలో భాగంగా పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి ఉద్యోగి రెండు మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం బీసీ వసతి గృహంను సందర్శించారు. విద్యార్థులకు ఎవరికైనా జ్వరాలు వచ్చాయా? అని అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు శుభ్రంగా ఉండడంతో వార్డెన్ చక్రధర్‌ను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, డీపీవో శ్రీనివాసరావు, ఎంపీడీవో గోపీబాబు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీరావులపల్లిలో ఓ ఇంటి ఆవరణలో ఉన్న నీటి డ్రమ్మును పరిశీలిస్తున్న కలెక్టర్

టీవీఎస్ షోరూం ప్రారంభం



భిక్కనూరులో టీవీఎస్ షోరూంను ప్రారంభిస్తున్న మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

భిక్కనూరు, ఆగస్టు 14 : భిక్కనూరులో శ్రీసిద్ధరామేశ్వర టీవీఎస్ షోరూంను మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ బుధవారం ప్రారంభించారు. కస్టమర్లకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో గంప గోవర్ధన్ తనయుడు గంప శశాంక్, మాజీ సర్పంచ్ తునికి వేణు, రైతు బంధు సమితి మండల కన్వీనర్ రాంచంద్రం, ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాజా మౌళి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు అందజేత

కామారెడ్డి, ఆగస్టు 14 : కామారెడ్డి కెనరా బ్యాంక్ బ్రాంచ్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యా జ్యోతి ఉపకార వేతనాల పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ కేటగిరికి చెందిన 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను బుధవారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, డీఈవో రాజు అందజేశారు. జిల్లాలో రూ.మూడు లక్షలు సీఎస్ఆర్ యాక్టివిటీలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్సీ, ఎస్టీ బాలికలకు ఇచ్చామని ఎల్టీఎం రవికాంత్ తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం అందజేత

కామారెడ్డి, ఆగస్టు 14 : జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్డుకు సంబంధించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో సిరిసిల్ల రోడ్‌లో ఉన్న వర్తక, వాణిజ్య, వ్యాపార సముదాయాల యజమానులతో 15 రోజుల క్రితం సమావేశం నిర్వహించామని పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు తమ వంతుగా మొదటి విడుతగా వారు రూ.రెండు లక్షలు బుధవారం అందజేశారని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పట్టణ పోలీసు తరపున అభినందనలు తెలిపారు. వారం పది రోజుల్లో కెమెరాలను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ పోలీసులు, వ్యాపార సంస్థల వారు పాల్గొన్నారు.

పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డికి విరాళం అందజేస్తున్న వర్తక వాణిజ్య, వ్యాపారాల సంస్థలు

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలి

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్ఫూర్తి వొకేషనల్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు రోడ్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, మాదకద్రవ్యాలు, ట్రాఫిక్ రూల్స్ తదితర విషయాలపై పట్టణ సీఐ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ రూల్స్‌ను పాటిస్తూ తమ ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు కళాబృందం, షీటీమ్స్ సెక్యూరిటీ సిబ్బంది, పట్టణ పోలీసులు, స్ఫూర్తి కళాశాల యాజమాన్యం ప్రతాప్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమపెళ్లి చేసుకుని కట్నం కోసం వేధింపులు

ఎల్లారెడ్డి రూరల్, ఆగస్టు 14 : అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్న వారిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గడ్డం ప్రియాంక, బాలాజీ నగర్ తండాకు చెందిన రత్నావత్ నటరాజ్ ఏడు నెలల క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నారు. కొద్ది రోజులుగా ప్రియాంకను భర్త నటరాజ్, అత్త జున్ను, మామ హరీలు కలిసి పెండ్లి సమయంలో ఎటువంటి కట్నం ఇవ్వలేదని, ఇప్పుడు కట్నం తీసుకురావాలని, లేకుంటే ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని వేధిస్తున్నారన్నారు.

ఈ విషయమై ప్రియాంకను వారు బూతుమాటలు తిడుతూ, కొడుతున్నారన్నారు. బాధితురాలు ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా షిండే జన్మదిన వేడుకలు

హన్మంత్ షిండేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మద్నూర్/నిజాంసాగర్/బిచ్కుంద, ఆగస్టు 14 : జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే జన్మదిన వేడుకలను మండలంలోని మేనూర్ గ్రామం లో నాయకులు, కార్యకర్తలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మంత్ షిండే కేక్ కట్ చేశారు. ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి బీఆర్ఎస్ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు సురేశ్, గఫార్, విజయ్‌కుమార్, గోవింద్, పాండురంగ్‌పటేల్, ఎంకేపటేల్, విలాస్, రాజుపటేల్, మారుతి, రవి, రాజు, సుధీర్, తులసీరామ్, లక్ష్మ ణ్, నాగేశ్, హన్మాండ్లు, దేవీదాస్, గోపి తదితరులు ఉన్నారు. మహ్మద్‌నగర్‌లోని జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు గృహంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే జన్మదిన వేడుకలు నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సత్యనారాయణ, గంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వాజిద్‌అలీ, విజయ్‌కుమార్, చందర్, లక్ష్మీనారాయణ, లక్ష్మారెడ్డి, సంగమేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. బిచ్కుందలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అశోక్‌పటేల్, రాజు, వెంకట్‌రావు దేశాయ్, నాల్చర్ సొసైటీ చైర్మన్ నాల్చర్ బాలాజీ, శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో రక్షాబంధన్

మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందికి, పాలకవర్గ సభ్యులకు రాఖీలు కడుతున్న బ్రహ్మకుమారీలు

బాన్సువాడ, ఆగస్టు 14 : బాన్సువాడలోని మున్సిపల్ కార్యాలయంలో కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి జయదీదీ ఆధ్వర్యంలో బుధవారం రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలు మున్సిపల్ చైర్మన్ గంగాధర్, కార్యాలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులకు రాఖీలు కట్టి, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో గంగాదేవి, లలిత, చంద్రకళ, స్వామి, శ్రీనివాస్‌రెడ్డి, సతీశ్, గైక్వాడ్ రుక్మిణి, ఉదయ్ గుప్తాతోపాటు మేనేజర్ మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

రామారెడ్డిలో..

రామారెడ్డి, ఆగస్టు 14 : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో బుధవారం విశ్వహిందు పరిషత్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు పాఠశాలల వద్ద రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రఖండ సంయోజక్ కడెం సాయికుమార్, అర్చకపురోహి తుడు అఖిల్‌సాయి, అభినయ్, నిఖిల్, వేణు, భాను చందర్, భరత్ విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాంటీన్‌కు స్థల పరిశీలన

బాన్సువాడ, ఆగస్టు 14 : బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళా సంఘం సభ్యులతో కలిసి మున్సిపల్ చైర్మన్ గంగాధర్ బుధవారం స్థలాన్ని పరిశీలించారు. వెంటనే పనులు ప్రారంభించాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, కౌన్సిలర్ హకీం, మెప్మా అధికారి రవిశంకర్, నాయకులు ఉదయ్ గుప్తా, రాఘవేంద్ర, మహిళా సంఘం అధ్యక్షురాలు సవిత, ఆర్పీ మాధవి, జ్యోతి, సిబ్బంది సతీశ్ ఉన్నారు.

యువకులకు క్రికెట్ కిట్ అందజేత

బాన్సువాడ రూరల్, ఆగస్టు 14 : మండలంలోని దేశాయిపేట్ గ్రామంలో బీజేపీ నాయకుడు శ్రీనివాస్ ఖర్గే ఆధ్వర్యంలో యువకులకు బుధవారం క్రికెట్ కిట్‌ను స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. యువకులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలని సూచించారు. బీజేపీ నాయకులు డాకయ్య, రాజాసింగ్, సాయిబాబా, యువకులు నాగరాజు, ధనుంజయ్, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కామారెడ్డి, ఆగస్టు 14 : విదేశాలలో ఉన్నత విద్యానభ్యసించాలనుకునే పేద ఎస్సీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఆర్థిక సహాయం అందిస్తున్నదని జిల్లా షెడ్యుల్డ్ కులాల అభివృద్ధి అధికారి రజిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యానిధి పథకానికి దరఖాస్తు గడువును అక్టోబర్ 13 వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు. ఒక కుటుంబం నుంచి ఒక విద్యార్థికి మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. http://www.telanaganaepass.cgg.gov.inలో గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 14 : మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆగస్టు 15ను పురస్కరించుకొని విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో తదితర పోటీలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. విద్యార్థులు తరగతి గదులను అందంగా అలంకరించుకున్నారు.

స్కావెంజర్ పోస్టుకు ఎంపిక

రాజంపేట్, ఆగస్టు 14 : మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల వసతిగృహంలో ఖాళీగా ఉన్న స్కావెంజర్ పోస్టుకు వారం రోజుల క్రితం దరఖాస్తులను ఆహ్వానించారు. బుధవారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యాకమిటీ సభ్యులు, పాఠశాల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి వచ్చిన నాలుగు దరఖాస్తుల్లో రాజంపేటకు చెందిన కొప్పుల భాగ్యశ్రీని ఎంపిక చేసినట్లు ఎస్‌వో శ్రీవాణి ఒక ప్రకటనలో తెలిపారు.

పేద కుటుంబానికి చేయూత

భిక్కనూరు, ఆగస్టు 14 : నిరుపేద కుటుంబానికి సమాచార హక్కు చట్టం జిల్లా ప్రతినిధి రవీందర్ చేయూతను అందించారు. భిక్కనూరులోని జెండా గల్లీలో పేద కుటుంబానికి చెందిన నర్సవ్వ, స్వామి ఇల్లు, ఇంటి పైకప్పు శిథిలావస్థలకు చేరింది. దీంతో కాలనీ ప్రజల ఆధ్వర్యంలో రవీందర్ సొంత డబ్బులతో ఇంటి పైకప్పు కోసం రేకులను కొనుగోలు చేసి వారికి అందజేశారు. సురేశ్, సాయి, నిఖిల్ రాజు, సిద్ధరాంలు, దయాకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

గాంధారి, ఆగస్టు 14 : మండలంలోని మేడిపల్లిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న కూర్మ లక్ష్మి ఈ నెల 10న ఆనారోగ్యంతో మృతి చెందింది. ఎల్లారెడ్డి సీడీపీవో సరిత మాత శిశు సంక్షేమ శాఖ తరపున మంజూరైన రూ.10 వేలను కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. సూపర్‌వైజర్ వినోదిని, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

పూర్తిస్థాయిలో గ్రామాల అభివృద్ధి

ఎంబురాలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

మద్నూర్, ఆగస్టు 14 : ప్రతి గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. డోంగ్లీ మండలంలోని ఎంబురా గ్రామంలో బుధవారం పర్యటించారు. ప్రజలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాచన్న మందిరానికి వెళ్లే రోడ్డు బాగలేదని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే మట్టి రోడ్డును ప్రారంభించారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా లక్ష్మీనారాయణ

ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

ఎల్లారెడ్డి, ఆగస్టు 1 : ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా లక్ష్మీనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. నిజామాబాద్ గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించిన లక్ష్మీనారాయణ సాధారణ బదిలీల్లో భాగంగా ఎల్లారెడ్డికి వచ్చారు. చరిత్ర విభాగంలో డాక్టర్ చంద్రకాంత్, తెలుగులో సహాయ ఆచార్యులుగా శంకరయ్య, కామర్స్ సహాయ ఆచార్యులుగా శివకుమార్ కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి వచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ శంకరయ్య, శివకుమార్, అమరేశం, ప్రభాకర్‌రావు, అరుణ్‌కుమార్, గంగారెడ్డి, సిద్దురాజ్ తదితరులు పాల్గొన్నారు.

పీజీ పరీక్షా కేంద్రం తనిఖీ

సౌత్ క్యాంపస్‌లో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న విశ్వ విద్యాలయం పరీక్ష నియంత్రణ అధికారిణి అరుణ

భిక్కనూరు, ఆగస్టు 14 : టీయూ దక్షిణ ప్రాంగణంలోని పీజీ విద్యార్థుల పరీక్షా కేంద్రాన్ని తెలంగాణ విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ అరుణ బుధవారం తనిఖీ చేశారు. చివరి రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షలకు మొత్తం 213 మంది విద్యార్థులకుగాను 207 మంది హాజరయ్యారని, మిగతా ఆరుగురు గైర్హాజరైనట్లు దక్షిణ ప్రాంగణ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

బీఆర్ఎస్ కార్యకర్తలు మృతిచెందగా.. వారి కుటుంబాలకు పార్టీ అండగా నిలిచింది. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో బాధిత కుటుంబాలకు ఇన్సూరెన్స్ మంజూరు ఆర్డర్ కాపీలను బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ సోమ భరత్‌కుమార్ బుధవారం అందజేశారు.

'క్లైమేట్ స్మార్ట్ గ్రీన్' పోస్టర్ల ఆవిష్కరణ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్

కామారెడ్డి, ఆగస్టు 14 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం, ఫారెస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో క్లైమేట్ స్మార్ట్ గ్రీన్ క్యాంపస్ క్లబ్‌కు సంబంధించిన పోస్టర్లను కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలు కళాశాల పరిధిలో చేపడుతూ విద్యార్థులు సమాజాన్ని చైతన్య పర్చాలన్నారు. ఈ క్లైమేట్ చేంజ్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ అనే అంశంపై హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య, వృక్షశాస్త్ర విభాగం నుంచి దినకర్, స్వాతి, శ్రీలత, ఫారెస్ట్ విభాగం నుంచి సుచరిన్ దయాన్, ప్రవీణ్ నాయక్, హిందీ ఆచార్యులు శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయక్‌పోడ్ సభ్యులు

నిజాంసాగర్, ఆగస్టు 14 : మహ్మద్‌నగర్ మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సవాయిసింగ్‌ను ఆదివాసి నాయక్‌పోడ్ కుల పెద్దలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పెంటయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలు, కోశాధికారి సాయిబాబా, కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకట్, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన మరమ్మతు పనులు ప్రారంభం

నాగిరెడ్డిపేట, ఆగస్టు 14 : మండలంలోని గోపాల్‌పేట నుంచి చీనూర్ గ్రామానికి వెళ్లే రోడ్డులో పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువపై ఉన్న వంతెన వద్ద మరమ్మతు పనులను బుధవారం ప్రారంభించినట్లు నీటిపారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. చేపడుతున్న పనులను ఆయన ఏఈ శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు. వంతెన సైడ్‌వాల్స్, రోడ్డు పూర్తిగా ధ్వంసమైనట్లు చెప్పారు. వాటి మరమ్మతుల కోసం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సొంత నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేశారన్నారు. పనులు నాణ్యతతో చేపట్టాలని గుత్తేదారు మురళీగౌడ్‌కు సూచించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న వంతెన మరమ్మతు పనులు

సామాజిక తనిఖీ

ప్రజావేదికలో పాల్గొన్న డీఆర్డీవో సురేందర్

రామారెడ్డి, ఆగస్టు 14: సదాశివనగర్ మండల కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ సామాజిక ప్రజావేదిక బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్డీవో సురేందర్ పాల్గొని.. వివిధ గ్రామాల్లో డీఆర్పీలు నిర్వహించిన సర్వేలను పరిశీలించారు. సర్వేలో వెల్లడైన లోటుపాట్లు, జాబ్‌కార్డు, మస్టర్, వర్క్‌సైట్, పే స్లిప్ తదితర అంశాల్లోని సమస్యలను సంబంధిత గ్రామ సెక్రటరీలు, టీఏ, ఎఫ్ఏలు వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా కొంతమంది సిబ్బందికి రూ.24వేల మేర రికవరీ రాశారు. సమావేశంలో ఎంపీడీవో సంతోష్, ఫైనాన్స్ మేనేజర్ రాంనారాయణ, మండల స్పెషల్ ఆఫీసర్ సతీశ్‌యాదవ్, ఏపీవో సురేందర్, ఎస్ఆర్పీ కవిత, ఏపీవో మధు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ

నిజాంసాగర్, ఆగస్టు 14 : మహ్మద్‌నగర్ మండలంలోని గాలిపూర్‌లో గతంలో విధులు నిర్వహించిన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌పై ఎంపీవో అనిత బుధవారం విచారణ చేపట్టారు. జీపీ కార్యదర్శిపై పది రోజుల క్రితం కొందరు గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీవో గాలిపూర్ గ్రామాన్ని సందర్శించి విచారణ నిర్వహించారు. సెక్రెటరీ తమ వద్ద నుంచి ఇంటి మార్పిడి, మరణ ధృవీకరణ పత్రాలు ఇచ్చేందుకు లంచం తీసుకున్నాడని వివరించారు. అంతేకాకుండా తమకు డూప్లికేట్ రశీదులు ఇచ్చాడని, డబ్బులు చెల్లించిన ఆన్‌లైన్‌లో తమ పేరు మార్పిడి కాలేదని ఎంపీవోకు తెలిపారు. పూర్తిస్థాయి విచారణ నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఎంపీవో తెలిపారు.

విచారణ చేపడుతున్న ఎంపీవో అనిత

గాంధారిలో వైద్య శిబిరం

గాంధారి, ఆగస్టు 14 : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం ఆయూష్ శాఖ ఆధ్వర్యంలో వృద్ధుల వైద్య శిబిరానికి నిర్వహించారు. ఆయూష్ వైద్యురాలు నీలిమ రోగులను పరీక్షించి మందులను అందజేశారు. కార్యక్రమంలో డీఎల్పీవో సురేందర్, ప్రోగామ్ డైరెక్టర్ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.